# సింగిల్ పేజీ కథలు

## ఆకలి...???

క్రొత్తపిక్చర్ రిలీజయింది.

థియేటర్ ఆవరణమంతా జనంతో కిటకిటలాడుతోంది. టికెట్స్ కోసం బుకింగ్ దగ్గర కొట్టుకుంటున్నారు. టికెట్ దొరుకుతుందో లేదో అనుకుంటూ పొడవుగా ఉన్న క్యూలో నిల్చున్నాను.



''పావలా ఉంటే ఇవ్వండిసార్...''

ఆ కంఠం విని తల త్రిప్పి చూసాను.

లోతుకుపోయిన కళ్ళతో దీనంగా నావంకే చూస్తున్నాడొక వ్యక్తి.

''మూడు రోజుల నుండి తిండి లేదు. కనీసం టీనీళ్ళన్నా తాగలేదు. మీరు ధర్మం చేసారంటే మీ పేరు చెప్పుకొని కాస్త టీనీళ్ళు తాగుతాను.'' కడుపు చేత పట్టుకొని మాట్లాడటానికి కూడా శక్తి లేనట్లుగా అన్నాడు.

అతని వైపొకసారి తేరిపార చూసాను.

ఎముకల గూడుకి చర్మం అంటించినట్లున్న ఒంటిమీద చిరుగల చొక్కా.... లోనికి పోయిన బుగ్గలు...మాసిన గెడ్డం...తైల సంస్కారం లేక ఎర్రబారిన జుట్టుతో దారిద్ర్యానికి మారుపేరుగా ఉన్నాడు.

అతన్ని చూస్తే నాకు జాలివేసింది. అతనికి పావలా ఇచ్చినంతమాత్రాన నాకు తరిగిపోయిందేమీ లేదనుకుంటూ జేబుల్లో చిల్లరకోసం వెదికాను. నా జేబులో రూపాయి బిళ్ళతప్ప ఇంక చిల్లర డబ్బులు లేవు. 'పోనీలే...టీ నీళ్ళన్నా తాగుతాడు' అనుకొని ఆ రూపాయి అతనికి ఇచ్చాను.

నావైపు కృతజ్ఞతగా చూసి, అలా అడుక్కుంటూ ముందుకు వెళ్ళాడతను.

అంతలో బుకింగ్ క్లోజ్ అయింది.

ఇక చేసేదిలేక బయటకు నడిచాను.

అక్కడ-

ఇందాక ఆకలి వేస్తుందంటూ నా దగ్గర రూపాయి వసూలు చేసిన వ్యక్తి, తన జేబులో ఉన్న చిల్లర డబ్బు అన్నీ తీసి పువ్వులమ్మే అమ్మి చేతిలో పోసాడు. ఆమె ఒక పెద్ద పూలమాల తీసి అతని చేతికిచ్చింది.

''మూడు రోజులుగా తిండిలేదని అడుక్కున్నవాడు పూలమాలకొంటున్నాడేమిటి?'' అనుకుంటూ అలాగే చీకట్లో నిలబడి గమనించసాగాను.

అతను ఆ పూలమాలను తీసుకెళ్ళి థియేటర్ ముందు ఉన్న తన అభిమాన హీరో బొమ్మకు అలంకరించి, ఆనందంతో ఓ మారు గట్టిగా విజిల్ వేసి, థియేటర్‌లోనికి పరుగుతీసాడు.

బద్దిగం పాండురంగారెడ్డి,
10-1-241/1, భాగ్యనగర్,
కరీంనగర్-505002

## మానవత్వం

రైలు ముందుకు పోతోంది.

''అమ్మో..కాళ్ళు తొక్కేస్తున్నారు.'' ఏడుపు మొదలుపెట్టింది నల్గురు పిల్లల తల్లి.

పిల్లలు కూడా శృతికలిపారు. భర్త ఏమీ చేయులేక కంగారుగా అలా చూస్తున్నాడు.

''రేపు పండగ పెట్టుకొని పిల్లలతో, లగేజీలతో జనరల్‌లో వెళ్లకపోతే రిజర్వేషన్ చేయించుకోవచ్చుగదండీ.'' వాళ్ళు పడే ఇబ్బందిని చూసి అప్రయత్నంగా అనేసాను.

''ఏ క్షణం బయలుదేర్తామో ఊహించని ప్రయాణాలు. అందుకే ఈ ఇక్కట్లు. లేకపోతే రిజర్వేషన్ చేయించుకునే వాళ్లం.'' బదులిచ్చాడు.

ఇంతలో వాళ్లావిడ..

''ఏం తల్లీ..సాటి ఆడదాన్ని, ఇలా ఇబ్బంది పడితే చూస్తారేటి, సీటు సర్దుబాటు చెయ్యగూడదా?'' ముందు సీట్లవాళ్లని అర్థిస్తోంది.

తమకేమీ పట్టనట్లు అందరూ కునికిపాట్లు పడుతున్నారు.

''మనుషులు కాదు రాక్షసులు. మానవత్వం లేకుండా రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు. ఎదుటోళ్లు కష్టాలు పడుతుంటే చూస్తున్నారు కాని చిన్నసీటు ఇస్తున్నారు కాదు.'' కోపంగా తిడుతోంది.

నాకు ఆ శోకాలకు ఓపిక నశించింది.

''ఎందుకండీ ఆ తిట్లు, మీరు ఎక్కడకి వెళ్తున్నారు?'' అడిగాను.

''విశాఖపట్నం...''చెప్పిందామె.

''విజయవాడలో సగం ఖాళీ, ఫ్రీగా వుంటుందిలెండి.'' ఎవరో పెద్దాయన చెప్పాడు. అలాగే నిల్చుని కునికిపాట్లు పడుతున్నాం.



విజయవాడ రానే వచ్చింది. చాలా సీట్లు ఖాళీ అయ్యాయి. ఎదురుగా వున్న సీట్లు ఖాళీ అవగానే భార్యాపిల్లలను కూర్చుండబెట్టి, లగేజీలు అన్ని పట్టుకొని, భర్త కూర్చున్నాడు.

నాకూ సీటు దొరికింది. కూర్చున్నాను. విజయవాడలో ఖాళీ అయిన దానికంటె చాలా ఫుల్లయ్యింది. బండిలో మొదటి పరిస్థితే.

గార్డు విజిల్ వేయడంతో రైలు బయలుదేరింది.

''అవమ్మా...వయసైపోయిన ముసల్దాన్ని, నిలబడనేకుండాను. ప్రాణం నీరసంగుంది, చిన్న జాగా సర్దిపెట్టమ్మా'' దీనంగా పదేళ్ల మనవడి వూతపట్టుకుంటూ ఆ జనాలలో ఉక్కిరి బిక్కిరి అయిపోతుంది.

ఆ మాట వినిపించగానే నల్గురు పిల్లలతో కూర్చున్న తల్లి ''అబ్బబ్బ... గోలగోల, రామేశ్వరం వెళ్లినా శనీశ్వరుడు వదలనట్లుంది. వెడవెడంగా కూర్చోండి. దిక్కుమాలిన బాధ సీటు కావాలట సీటు.'' చేతిలో వున్న లగేజీ ఒళ్లో పెట్టుకుంటూ భర్తతో చెప్తోంది.

''సత్యవతీ...పాపం ముసలావిడ చాలా ఇబ్బంది పడుతోంది. కొద్దిగా సర్దుకొని కూర్చోగూడదూ'' భర్త చెప్తున్నాడు.

''మీరుండండి...సీటు కోసం ఇబ్బంది పడితే మనకెందుకండీ. ఎవరికి సీటిచ్చేది లేదు. కళ్లు మూసుకుని పడుకోండి.'' భర్తను మందలించినట్లుగా చెప్పిందామె.

భార్యావిధేయుడిలా అతను మారు మాట్లాడలేదు.

ఏం మానవత్వమండీ బాబు ఈవిడది. సమాజంలో శ్రీరంగనీతులు చెప్పేవారేగాని పాటించేవారు మాత్రం ఎక్కడోవుంటారు. ముందు ఇలాంటి సత్యవతిలాంటి వాళ్లు మారాలి. అప్పుడే ఈ సమాజం మానవతా విలువలతో ముందుకు పోగలదు- మనసులో అనుకున్నాను.

నేను కొద్దిగా సర్దుకొని ముసలావిడకు, వాళ్లమనవడికి చోటిచ్చాను. ఇంతవరకు ఇవన్నీ గమనించిన నాకు అప్రయత్నంగా నవ్వు వచ్చేసింది.

ఫక్కున నవ్వాను.

ముందుసీట్లలో కూర్చున్న నల్గురు పిల్లల ఫ్యామిలీ మానవత్వానికి నవ్వాగటం లేదు.

ఆ నవ్వులో అర్థం ఆవిడ గ్రహించే వుంటుంది. తల దించుకుంది.